


"మనదేశంలో ఫాదర్స్‌డేలూ మదర్స్‌డేలూ పనికి రావురా. అవన్నీ ఇక్కడ పిచ్చివాళ్ళ వింత చేష్టల్లా అనిపిస్తాయి." సుధామ ప్రతిపాదనను తిరస్కరించాడు శ్రావణ్.

"ఒరేయ్ ప్రతికూలతలు ప్రతిరంగంలోనూ ఉంటాయిరా. ఇటువంటి విషయాల్లో అవి మరీ ఎక్కువ. రాజా రామ్మోహనరాయ్, వీరేశలింగం పంతులు, గురజాడ అప్పారావు... వీళ్ళంతా ఎన్ని ఎదురుదెబ్బలు తిని..." సుధామ మాట పూర్తికాలేదు.

"మనం చేసే పనులకి వాళ్ళనెందుకురా లాగుతావ్?" అడ్డుకున్నాడు రాహుల్. "వాళ్ళు సంస్కర్తలు. మనకూ వాళ్ళకూ నక్కకూ నాకలోకానికీ ఉన్నంత తేడా వుంది.

"నో!నో! యు ఆర్ రాంగ్ మిస్టర్ రాహుల్. మనం చేసేది కూడా సంఘ సంస్కరణే. ఛాందసభావాలను ఖండిస్తూ, ప్రపంచ దేశాల సరసన మనం నిలబడాలంటే... ఇలాంటి నాగరిక లక్షణాలు అలవరచుకోవాలి. ఆధునికతను ఆహ్వానించలేకపోతే పాతరాతియుగంలోకి జారిపోతాం మనం. నీలాంటి వాడే ఓ

ముస్లిం దేశస్థుడు ఆ దేశ మహిళలు ఆటల పోటీల్లో పాల్గొనవచ్చుగానీ, బురఖాలు మాత్రం వదలొద్దన్నాడట..."

శ్రవణ్ నవ్వాడు, రాహుల్ ఉడుక్కున్నాడు.

"అసలు ఫాదర్స్‌డే ఎందుకు జరుపుకుంటారో చెప్పరా!" చురుగ్గా, అడిగాడు రాహుల్.

"మదర్స్‌డే ఎందుకో ఇదీ అందుకే!" భుజాలెగరేస్తూ, చాలా సింపుల్‌గా అనేశాడు శ్రవణ్.

"అదెందుకు?" వెంటనే రాహుల్ సూటి ప్రశ్న మళ్ళీ.

"నీ బర్త్‌డే ఎందుకో, ఇదీ అందుకే" అంతే ఫాస్ట్‌గా జవాబు చెప్పాడు శ్రవణ్.

"బర్త్‌డే ఎందుకు? అని అడగకు సిల్లీగా..." అప్పుడే అక్కడికి వచ్చి వీళ్ళ సంభాషణ వింటున్న కార్తీక్ రాహుల్‌ని మరో ప్రశ్న వేయకుండా అడ్డుకున్నాడు.

మిత్రులు నలుగురూ అసెంబ్లీలో ఎమ్మెల్యేలలా వాదించుకొని చివరకు 'మెజారిటీ ఈజ్ లా' అన్నట్టు ఫాదర్స్‌డే జరపడమే న్యాయమని, జరపకపోవడం అజ్ఞానం, అనాగరికమని నిర్ణయించేశారు.

వాళ్ళు ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ ఫైనల్ విద్యార్థులు. జూన్ 20వ తేదీన ఆదివారం - కళాశాలలో ఫాదర్స్‌డే నిర్వహించేందుకు సమాయత్తమయ్యారు. లెక్చరర్లలో కొందరు వాళ్లకు తమ ప్రోత్సాహాన్ని అందించారు. ఒక మంచి కార్యక్రమంతో కొత్త సంవత్సరం ప్రారంభం చేయడం శుభసూచకమని వాళ్ళ వెన్ను తట్టారు. పనిలో పనిగా టీచర్స్‌డేని ఇంతకంటే ఘనంగా నిర్వహించాలని సూచించాడు ఓ సీనియర్ లెక్చరర్.

ముందుగా ఎంపిక చేసుకున్న కొందరు ఉత్తమ తండ్రులను ఈ సందర్భంగా గౌరవించారు. శాలువాలతో సత్కరించి, తలా ఐదువేల నగదు, ఓ గిఫ్ట్ బహూకరించారు. నిజంగా ఆ సభ కన్నుల పండుగలా వుంది.

కార్యక్రమానికి వచ్చిన అతిథులు తమ ఉపన్యాసాల్లో విద్యార్థుల పితృభక్తిని, శిశువికాసంలో పితృశక్తినీ వివిధ రకాలుగా ప్రశంసించారు. చివరగా లెక్చరర్ నాగలింగం మైక్ అందుకున్నాడు.

"ప్రియమైన విద్యార్థుల్లారా! మీరనుమతిస్తే మిమ్మల్ని 'ప్రియమైన నా బిడ్డల్లారా!' అని సంబోధిస్తాను..."

సభంతా కరతాళ ధ్వనుల్తో ఒక్క నిముషం మార్మోగిపోయింది.

"సినిమాల్లో లెక్చరర్లనూ, టీచర్లనూ బఫూన్లుగానూ, తండ్రులను అసమర్థపు వాజమ్మలుగానూ చూపిస్తున్న ఈ కాలంలో మా కళాశాల విద్యార్థులైన మీరంతా తండ్రుల దినం...అదే - పితృత్వదినోత్సవం జరపడం ముదావహం. అందుకు మిమ్మల్నందరినీ పేరు పేరునా అభినందిస్తున్నాను."

మరోమారు చప్పట్లు.

ఈ కార్యక్రమం ఇంత ఘనంగా జరపడానికి మీరు డబ్బులు సమకూర్చుకున్నారు. ఈ డబ్బు మీ సొంతమేనా? మీ తండ్రులను ఇబ్బంది పెట్టకుండానే తెచ్చారా?? తండ్రులకు మాటమాత్రంగా కూడా తెలియకుండా తెచ్చినవాళ్ళూ ఉన్నారా??"

అక్కడ నిశ్శబ్దం అలుముకుంది - చిక్కగా.

"మరో ప్రశ్న! ఎవరి తండ్రుల పట్లనో ఇంతటి ఆదరాభిమానాలు చూపిస్తున్న మీరు - నిజంగా మీ ఇళ్ళలో తండ్రుల్ని ఎలా గౌరవిస్తున్నారు? నిత్యం మీ తల్లిదండ్రులకు పాదాభివందనం చేసే వాళ్ళెవరైనా ఉన్నారా? వాళ్ళ పట్ల ఆత్మీయత, అభిమానం చూయిస్తున్నారా? కనీసం వాళ్ళకి ఎదురు మాట్లాడకుండా ఉండగల్గుతున్నారా...?"

సభలో గుసగుసలు, అక్కడక్కడా బలహీనంగా నిరసన సంకేత శబ్దాలు.

"నాకు తెలుసు. మీరంతా నేను ఛాందసంగా మాట్లాడుతున్నానను కుంటున్నారు. ఇరవై ఒకటో శతాబ్దంలో జీవిస్తున్న మీరు - నేను పాతరాతియుగం గురించి ప్రస్తావిస్తున్నాననుకోవడంలో తప్పులేదు.

"కాళ్లు మొక్కితేనే గౌరవమున్నట్టా?" అని అడగాలనుకునేవాళ్ళూ మీలో ఉన్నారు. మన గౌరవాన్నీ, భక్తినీ ప్రకటించుకునేందుకు అదీ ఒక మార్గమే. కనబడని దేవుని ప్రతినిధులైన రాతిబొమ్మల ముందు లెంపలు వాయించుకుంటూ, సాష్టాంగ దండాలు చేసేందుకు ఉత్సాహం చూయించే మనం - సాక్షాత్ దైవస్వరూపులైన తల్లిదండ్రుల పాదాలకు నమస్కరించడం అవమానకరంగా భావించడమెందుకు?

"మనం తినే తిండి, పీల్చేగాలి, తాగే నీరు, పెరిగే వాతావరణం, నడిచే నేలను బట్టి - సంస్కారం, జీవనశైలీ అలవడతాయి. మన దేశంలోని కుటుంబవ్యవస్థ ప్రపంచానికే ఆదర్శప్రాయమైంది. ఇక్కడ తల్లి, తండ్రి, గురువు, అతిథి నిత్య పూజ్యులు. చనిపోయిన వాళ్ళకే 'దినం', బతికున్నవాళ్ళకు ప్రతిక్షణం ప్రేమా, అభిమానం, ఆత్మీయత, ఆదరణా లభిస్తాయి - లభించాలి.

"నాగరికత వెర్రితలలు వేసే పాశ్చాత్యుల్లో మానవ సంబంధాలు అంతంత మాత్రమే. అందుకే ఏడాదికోసారైనా తల్లిదండ్రుల్ని గౌరవించడం.... మర్యాద పాటించడం, జీవకారుణ్యాన్ని ప్రదర్శించడం లాంటి ఏర్పాట్లు చేసుకున్నారు.

"ఎక్కడో నీళ్లు దొరకని దేశంలో వారానికోసారి స్నానం చేసే ఏర్పాటు చేసుకుంటే, అదే గొప్ప ఆచారమని నిత్యగంగఝురులెత్తే ఇక్కడ కూడా ఆ పద్ధతి పాటించే అమాయకులున్నారు - మనలోనే.

"ఈ 'దినం' తల్లిదండ్రుల్ని మరచిపోయి, నిర్లజ్జగా స్వార్థం ఊబిలో కూరుకుపోతున్నవారికి 'చెంపపెట్టు' కావాలి కాని సార్వజనీనం కాకూడదు. ఈ సందర్భంగా మీకో ప్రత్యేకమైన వ్యక్తిని పరిచయం చేస్తాను......

"పర్మయ్యగారూ! ఇటు రండి!" నాగలింగం చూస్తున్నవైపు చూశారు అందరూ.

ఆ వ్యక్తి మెదలలేదు. విద్యార్థులకు అర్థం కాలేదు. అతనెవరో తెలుసు కోవాలనే ఆరాటం పెరిగింది అందరిలో....

"ఫర్వాలేదు. ఒక్కసారి ఇలా రండి!" విద్యార్థులంతా ఉత్కంఠంగా లేచి చూస్తున్నారు.

"పిల్లలూ! రెండో ద్వారం దగ్గర శాలువా కప్పుకొని ఉన్నారే, వారినిలా తీసుకురండి!"

వెంటనే ఆయన్ని గమనించిన ఇద్దరు విద్యార్థులు ఆయన వారిస్తున్నా వినకుండా వేదికపైకి తీసుకొని వెళ్ళారు.

"వీరి పేరు పర్మయ్యగారు..."

మాసిన గుడ్డలూ, గడ్డమూ అతని దైన్యాన్ని చాటుతున్నాయి. కంగారూ, భయం అతడ్ని స్థిరంగా నిలువనీయడం లేదు. తప్పనిసరై అతను చేతులెత్తాడు - నమస్కరించేందుకు.

అంతవరకూ శాలువా వెనుక దాక్కున్న ఎడమచేయి బయటపడింది. దానికి వ్రేళ్ళులేవు.

"వీరిది ఈ మహానగరానికి డెబ్బై కిలోమీటర్ల దూరంలోనున్న ఓ పల్లెటూరు. ఈయన వృత్తి బుట్టలల్లటం. ఓ ప్రమాదంలో చేతివేళ్ళు పోగొట్టుకున్న ఈయన అధైర్యపడలేదు. ఒంటి చేత్తోనే తన వృత్తిని ఇప్పటికీ సమర్థవంతంగా నెరవేరు స్తున్నాడు. కష్టపడి అన్ని పనులూ చేస్తున్నాడు.

"మరో విషయం చెబితే మీరు ఆశ్చర్యపోతారు. ఈ మధ్యనే ఈయన భార్యకు జబ్బు చేసింది. అది పక్షవాతంగా మారింది. సంపాదించే పనికి తోడు భార్యసేవ తప్పలేదు. పసిబిడ్డకు చేసినట్లు అన్ని సేవలూ చేస్తున్నారు...."

"పిల్లల్లేరా?" వేదిక మీదున్న పెద్దల్లో ఒకాయన అడిగారు.

"కూతురు పెళ్ళయింది. అల్లుడు తన భార్యను వీళ్ళ దగ్గరికి రానీయకుండా కట్టడి చేశాడట."

"కొడుకులు..." కిందినుండి ఎవరో అరిచారు.

"ఆ! ఆ కొడుకు కోసమే ఇంత దూరం వచ్చారాయన. అడ్రసు పట్టుకొని వెతుక్కుంటూ నా కంటబడ్డారు. ఆత్మీయంగా అడిగేసరికి అన్ని సంగతులూ చెప్పారు. ఆ అబ్బాయి మీలోనే ఉన్నారు...."

అక్కడ మరోసారి నిశ్శబ్దం ఆవరించింది - దట్టమైన భయంలా.

"అతని పేరు....."

"బాబూ! మీకు నమస్తె జేస్త!" ఒకటిన్నర చేతితో పర్మయ్య నమస్కరించాడు. "వానిపేరు జెప్పకుర్రి. ఇంత మందిల వాని ఇజ్జతు దియ్యకుర్రి. నాకు గల్గిన నశీవ (తలరాత)కు నేను వాణ్ణి బద్‌నాం జెయ్యదల్సుకోలేదు. నా బిడ్డలు మంచోళ్ళే. వాళ్లు ఏమీదెలువని అమాయకులు. వాళ్ల తల్లి పిల్లలను సూడాలని అంగలారుస్తున్నది. కళ్ళల్ల ప్రాణంబెట్టుకున్నది...."

అతని గొంతు పూడుకుపోయింది. కళ్ళల్లో నుండి నీళ్ళు, దుఃఖం ఆపుకోలేక పోయాడు. అప్పుడు నాగలింగం అందుకున్నాడు....

"పిల్లలూ! ఇదీ మన జీవన విధానం. కుటుంబంలో ఒకరి కోసం మరొకరు పడే ఆరాటం. ఇది సంవత్సరంలో ఒక్క రోజు కార్యక్రమంతో తుడిచేస్తే పోయేది కాదు....

"పర్మయ్యగారూ! రండి! మీ అబ్బాయిని మీ వెంట పంపిస్తాను." ఆయన చేయి పట్టుకొని స్టేజీ పక్కకు తీసుకొని వెళ్ళసాగాడు నాగలింగం.

అప్పటివరకూ ఎక్కడున్నాడో గాని ఆ క్షణంలో బాణంలా దూసుకొని వచ్చి తండ్రి కాళ్ళకు చుట్టుకొని కన్నీళ్ళతో అభిషేకం చేయసాగాడు కొడుకు.

అతడు శ్రవణ్‌కుమార్.

**(16-08-2004 జాగృతి సచిత్ర వారపత్రిక)**